సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 19 । మే । 2023



ఏం జరిగిందో పాపం..!
లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేట సమీపంలోని లేఅవుట్ వద్ద కళ్లేపల్లికి చెందిన గోకేడ ఉమామహేశ్వరి(29) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. - 8లో



రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి
విజయనగరంలో ఈనెల 20,21 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-19 జిల్లా బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక గురువారం పూర్తయింది. - 8లో



వేతన వేదన దూరం..!
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే వేతనదారులకు చేసిన పనికి సంబంధించి వేతనాలను ప్రభుత్వం త్వరగా చెల్లిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

25,27 తేదీల్లో విద్యార్థులు, హెచ్‌ఎంలకు సత్కారం

పార్వతీపురం: పదోతరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, శతశాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరిస్తామని డీఈఓ జి.ప్రేమ్ కుమార్ గురువారం తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో మే 25న, జిల్లా స్థాయిలో మే 27న సత్కార కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఈ నెల 19న నిర్వహించాలని నిర్ణయించామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తేదీలు మార్పుచేసినట్టు వెల్లడించారు.

రసాయనాలతో మగ్గబెడితే చర్యలు



మామిడి కాయలను మగ్గబెట్టే విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బొబ్బిలి: వేసవి సీజన్లో మామిడి కాయలను మగ్గబెట్టేందుకు ప్రమాదకరమైన రసాయనాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి ఏఎంసీ కార్యదర్శి అరుణకుమారి హెచ్చరించారు. ఏఎంసీ పరిధిలోని మామిడి కాయల కలెక్షన్ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. మగ్గబెట్టే విధానాలను తనిఖీ చేశారు. కలెక్షన్ సెంటర్ యజమానులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ మగ్గబెట్టే విధానాలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఉద్యాన శాఖాధికారి మోహన్‌కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

26లోగా ఫీజు చెల్లించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎడ్ రెండవ సెమిస్టర్ (2023 జూన్‌లో నిర్వహించే) పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, గత సెమిస్టర్ పరీక్షలో తప్పిన విద్యార్థులు అపరాధరుసుము లేకుండా ఈ నెల 26లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 30లోగా చెల్లించాలన్నారు. ఒక సబ్జెక్టుకు రూ.100, రెండు సబ్జెక్టులకు రూ.120, మూడు సబ్జెక్టులకు రూ.140, నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.150 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష రుసుము పేమెంట్ గెట్‌వే ద్వారా చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు www. bre.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతులతో భర్తీ చేస్తామని, తాత్కాలిక సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలను ఈ నెల 19వ తేదీ శుక్రవారంలోగా తమ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. తుది సీనియారిటీ జాబితాను 20వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతామని పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్.కోట మండలం ధర్మవరం ఉన్నత పాఠశాల భవనాల్లో ఈ ఏడాది నిర్వహిస్తున్న బాలికల కళాశాలలో పనిచేసేందుకు దరఖాస్తు చేసిన వారి సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందిపర్చినట్లు డీఈఓ. బి.లింగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ(శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు అర్హత ధ్రువీకరణ పత్రాలతో డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

ఆర్‌ఈసీఎస్‌లో తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు

చీపురుపల్లిరూరల్: గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న బి.జగన్నాథం(ఏడీఈ), పీవీజే రాజు (జేఏఓ)ను విధుల నుంచి తొలగించినట్టు ఆ సంస్థ ఎం.డి. పి.రమేష్ తెలిపారు. ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న బి.జగన్నాథం 2020లో ఉద్యోగ విరమణ పొందారు. జేఏఓగా విధులు నిర్వహిస్తున్న పీవీజే రాజు 2016లో ఉద్యోగ విరమణ పొందారు. ఆర్‌ఈసీఎస్‌లో ఉద్యోగుల కొరత దృష్ట్యా తాత్కాలిక పద్ధతిలో వీరిని నియమించామని, ప్రతిమూడు నెలలకు ఒకసారి వీరి సేవలను పొడిగిస్తూ వస్తున్నట్టు ఎం.డి తెలిపారు. ప్రస్తుతం ఆర్‌ఈసీఎస్ సంస్థ కార్యకలాపాలను ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలిక పద్ధతిపై కొనసాగుతున్న వీరి విధులను నిలిపివేస్తున్నట్టు ఎమ్‌డీ తెలిపారు.

గాలివాన బీభత్సం



- నేలకూలిన చెట్లు
- రైల్వే ట్రాక్‌పై చెట్టుకూలడంతో నిలిచిన రైళ్ల రాకపోకలు
- విరిగిన విద్యుత్ స్తంభాలు
- సరఫరాకు తీవ్ర అంతరాయం
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో నిమగ్నమైన ఆ శాఖ సిబ్బంది
- పలుచోట్ల పిడుగులు

పార్వతీపురంటౌన్/కురుపాం/భామిని/సీతంపేట/జియ్యమ్మవలస: పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం సాయంత్రం గంట కాలంపాటు గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఎక్కడికక్కడే చెట్లు నేలకూలాయి. కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రాకపోకలు నిలిచిపోయాయి. అధికార యంత్రాంగం సమష్టిగా రోడ్లపై కూలిన చెట్లు తొలగించింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టింది.

- పార్వతీపురం రైల్వేస్టేషన్ పరిధిలో గాలివానకు ట్రాక్‌పై హైటెన్షన్ లైన్‌పై విరిగిపడడంతో భారీ మంటలు చెలరేగాయి. రైల్వే అధికారులు స్పందించి సరఫరాను నిలిపివేశారు. వైర్లు తెగిపడడంతో రైళ్లు నిలిచిపోయాయని, నాలుగు గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్టు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.
- పార్వతీపురం పట్టణంలోని అతి పురాతన సత్యనారాయణస్వామి దేవాలయం మండపంపై చెట్టు విరిగి పడడంతో దేవాలయ మండపం పూర్తిగా దెబ్బతింది. ప్రహరీ సైతం పాడైనట్టు ఈఓ ప్రసాదరావు తెలిపారు. సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు.
- భామిని మండలంలోని ఏబీ రోడ్డుపై భారీ చెట్టు కూలిపోవడంతో వాహన రాకపోకలకు గంటల కొలది అంతరాయం కలిగింది. సింగిడి-పసుకుడి గ్రామాల మధ్య పెద్దఖానా వద్ద భారీ చింత చెట్టు కూలిపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. గురండి-బిల్లుమడ గ్రామాల మధ్య రోడ్డుపై సిరిసిం చెట్టు కొమ్మలు పడ్డాయి. భామిని, బత్తిలి, కాట్రగడ కూడళ్లలోనూ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. నేరడి-బి సచివాలయం సమీపంలో త్రినాథపండా ఇంటిపై పెద్ద చెట్టు కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లింది.
- సీతంపేటలో కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి మామిడి, జీడిమామిడి పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



పార్వతీపురం పట్టణం జగన్నాథపురం కాలనీలో విద్యుత్ తీగలపై పడిన చెట్టుకొమ్మ



రైల్వే హైటెన్షన్ లైన్‌పై చెట్టుపడి చెలరేగుతున్న మంటలు (ఇన్‌సెట్లో) కురుపాంలో వడగళ్లు ఇలా..

- జియ్యమ్మవలస మండలంలోని రావాడ రామభద్రపురం పరిసర ప్రాంతాల్లోని కొబ్బరి చెట్టుపై పిడుగుపడడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. గ్రామ పొలిమేరలోనే పిడుగు పడి మంటలు రావడంతో పశువుల కాపర్లు గ్రామంలోకి పరుగు తీశారు.
- కురుపాం మండల కేంద్రంలో వడగళ్ల వాన కురిసింది. సుమారు అరగంట సమయం పాటు కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.
- కొమరాడ మండలంలోని జంఝావతి ప్రధాన రహదారిపై చెట్టు కూలడంతో రాకపోకలకు ఆంధ్రా-ఒడిశా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి చెట్టు తొలిగించి రాకపోకలను పునరుద్ధరించారు.

కూలిన ఇంటిగోడ

సీతానగరం: ఈదురుగాలి ధాటికి పెదబోగిలి కాలనీకి చెందిన పోరాపు శంకరరావు సిమ్మెంట్ రేకుల ఇంటిపై చెట్టు పడడంతో గోడ కూలిపోయింది. వర్షానికి ఇంటిలోని తిండిగింజలన్నీ తడిసిముద్దయ్యాయి.



జియ్యమ్మవలస: రావాడ రామభద్రపురం వద్ద కొబ్బరిచెట్టుపై పిడుగుపడడంతో రేగిన మంటలు



భామిని: నేరడి-బిలో త్రినాథ్‌పండా ఇంటిపై కూలిన భారీవృక్షం



కొమరాడ: జంఝావతి ప్రధాన రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



భామిని: నేలరాలిన మామిడి కాయలు



పట్టణ ప్రధాన రోడ్డులో కూలిన చెట్లను తొలిగిస్తున్న మున్సిపల్ అధికారులు



భామిని: ఇసుక కుప్పలపై తేలిన వడగళ్లు

సాగుకు పెట్టుబడి సాయం

- 2023-24లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు
- ఖరీఫ్, రబీ రుణాల మంజూరుకు చర్యలు
- జిల్లాలో 1,23,869 మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు
- సకాలంలో రుణాలు చెల్లిస్తే పూర్తిస్థాయి వడ్డీ రాయితీ
- 2023-24 లక్ష్యం 1.05 లక్షల మంది రైతులకు రూ.1414 కోట్లు



వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

జిల్లాలో రుణాలు మంజూరు ఇలా...

కిసాన్ క్రెడిట్ కార్డులు:	1,23,869
పూచీకత్తు లేకుండా ఇచ్చే రుణం	రూ.1.60 లక్షలు
2023-24 రుణ లక్ష్యం	రూ.1,414 కోట్లు

పార్వతీపురం టౌన్: ఖరీఫ్ సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. రైతులకు సాగు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2023-24 సంవత్సరానికి పంటల వారీగా రుణపరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందేందుకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 1,23,869 మంది రైతుల వద్ద కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. వీరికి ఎలాంటి పూచీకత్తు లేకుండా గరిష్ఠంగా రూ.1.60 లక్షల వరకు ఏడుశాతం వడ్డీపై పంట రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయి. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3 శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. ఏడాదిలోగా రూ.లక్షలోపు రుణం చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి పూర్తిస్థాయిలో మినహాయింపు పొందే అవకాశం ఉంది.

అర్హులందరికీ రుణాలు



జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణం అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్ కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 1.23 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించాం. రుణం ఏడాదిలోగా చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు. రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకుని ఇబ్బందులు పడకుండా బ్యాంకులో రుణాలు తీసుకుని వడ్డీ రాయితీ పొందాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తాం.

– జి.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, పార్వతీపురం మన్యం

పంట రుణాలు మంజూరు చేయండి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులకు పంట రుణాలు మంజూరుచేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డిని కోరారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులకు పంట రుణాలు మంజూరులో బ్యాంకర్లు వెనుకంజ వేస్తున్నారని, దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్‌రెడ్డి స్పందిస్తూ రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి ఆదేశించారు. బ్యాంకర్లు, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి తెలిపారు. కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహనిర్మాణం, వ్యవసాయం తదితర అంశాలను సమీక్షించారు. జగనన్న పాలవెల్లువ కింద కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ రమేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, ఏపీఎంఐపీ పీడీ ఎల్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ(కాపుతో కలిపి) విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సోషల్‌వెల్ఫేర్ డీడీ పి.రత్నం గురువారం ఒకప్రకటనలో తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సుల్లో ఏదైనా 21 కేటగిరీల సబ్జెక్టుల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 50 ఉత్తమ యూనివర్సిటీ/కాలేజీలో ప్రపంచ దేశాల్లోని నూతన జాబితా క్యూఎస్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారి ప్రపంచ ర్యాంకింగ్-2023 ప్రకారం సుమారు 379 యూనివర్సిటీ/కాలేజీల్లో చదువుకునేవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేయనున్న విద్యార్థులు క్వాలిఫైయింగ్ పరీక్షలో 60 శాతం మార్కులు లేదా తత్సమాన గ్రేడ్ కలిగి ఉండాలన్నారు. ఎంబీబీఎస్‌కు దరఖాస్తు చేయనున్న విద్యార్థులు నీట్ పరీక్షల్లో తప్పనిసరిగా క్వాలిఫై కావాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా జూన్ 10 తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పులను బీఎల్‌ఓల ఆధ్వర్యంలో తనిఖీచేసి తప్పులులేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచించారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను వ్యక్తిగతంగా పరిశీలించాలన్నారు. మండలాల వారీగా ఓటర్ల జాబితాలను విశ్లేషించుకుని జనాభానిష్పత్తికి తగ్గట్టుగా జస్టిఫికేషన్ ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌లతో గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. విజయనగరం జిల్లా ఎన్నికల జాబితాల రూపకల్పనలో అనుసరిస్తున్న ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను పీపీటీ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈవీఎం గొడౌన్ స్టేటస్, ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, సిబ్బంది నియామకం, రాండమైజేషన్, శిక్షణ డాటా అప్‌లోడ్ చేయడం తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. సమావేశం అనంతరం కలెక్టర్ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్సులో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీఓ సూర్యకళ, ఉపకలెక్టర్లు పద్మలత, సూర్యనారాయణ, శేషశైలజ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులు

ఐటీడీఏలో ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఐటీడీఏలకే
- వివిధ విభాగాలకు అధికారులు వచ్చే అవకాశం
- డీడీ, పీహెచ్‌ఓ, మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి మార్గం సుగమం

సీతంపేట: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐటీడీఏల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో కీలక విభాగాల ఖాళీలు దాదాపు భర్తీఅయ్యే అవకాశాలు ఉన్నాయి. తొలుత ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీలన్నింటినీ భర్తీచేస్తూ ఆ తర్వాత నాన్ ఐటీడీఏ ప్రాంతాల్లో బదిలీలు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా సీతంపేట ఐటీడీఏలో వివిధ విభాగాలకు ఉన్నతస్థాయి, ద్వితీయ స్థాయి అధికారిక పోస్టులు భర్తీకానున్నాయి. క్షేత్రస్థాయిలో పథకాల పర్యవేక్షణ, పాలనాపరమైన ఇబ్బందులు తొలగనున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఐటీడీఏ మేనేజర్ పోస్టు, అక్కౌంట్స్ మేనేజర్, డీఎస్‌ఓ, ఎస్‌ఓ పోస్టులు మొత్తం ఖాళీగా ఉన్నాయి. వీటిలో కొన్ని పోస్టుల్లో అదనపు బాధ్యతలను అసిస్టెంట్ అక్కౌంట్స్ ఆఫీసర్ ఒక్కరే నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు హార్టీకల్చర్ ఆఫీసర్ పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన అధికారికి డీహెచ్‌ఓగా బదిలీ కావడంతో ఆ స్థానంలో ఎవ్వరూ రాలేదు. దీంతో ప్రాజెక్టు అగ్రికల్చర్ ఆఫీసర్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే హెచ్‌ఓ పోస్టు కూడా ఏడాదిగా ఖాళీగా ఉంది. ఈ పోస్టులో పాలకొండ హెచ్‌ఓ ఎఫ్‌ఏసీగా ఉన్నారు. ముఖ్యంగా ఉద్యానవనాలను ప్రోత్సాహించేందుకు వీలుగా తప్పనిసరిగా అధికారి ఉండాలి. దాదాపు 25 వేల హెక్టార్లలో జీడి, మామిడి, పైనాపిల్, పసుపు వంటి ఉద్యానవన పంటలు విస్తరించి ఉన్నాయి. వీటిని పర్యవేక్షించి ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. వైఎస్సార్ క్రాంతి పథకంలో కీలకమైన ఏపీడీ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. ఇక్కడ డీపీఎం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఇదే శాఖలో కొన్ని ఏపీఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ట్రైబల్ ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ పరిధిలోని 7 మండలాల్లో వెలుగు కార్యక్రమాలు గాడిపెట్టాల్సి ఉంది. అలాగే, గిరిజన సంక్షేమశాఖ డీడీ పోస్టు ఇక్కడ ఖాళీగా ఉంది. 47 సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, మరో 13పోస్టు మెట్రిక్ హాస్టల్స్ వంటివి పర్యవేక్షించాల్సి ఉంది. డిప్యూటీ డీఈఓ పోస్టు సైతం ఖాళీగా ఉంది. వీటిలో శ్రీకాకుళం జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత బదిలీల్లో ఈ పోస్టులన్నీ భర్తీ కానున్నాయని అధికారులు చెబుతున్నారు.



సీతంపేట ఐటీడీఏ

ఖాళీల భర్తీకి చర్యలు



ఐటీడీఏలో కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమే. కలెక్టర్‌తో జరగనున్న సమావేశంలో ఈ అంశంపై చర్చించాం. ఏఏ పోస్టులు ఖాళీలు ఉన్నాయనేది ప్రభుత్వానికి నివేదిస్తాం. బదిలీల ద్వారా కీలక పోస్టుల భర్తీకి అవకాశముంది.

– కల్పనాకుమారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సీతంపేట

క్లుప్తంగా

ఉపాధి వేతనదారులపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడిన వేతనదారులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

కురుపాం: కురుపాం పంచాయతీ శివ్వన్నపేట గ్రామ సమీపంలో గురువారం ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులపై తేనె టీగలు దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామ సమీపంలో ఏకలవ్య పాఠశాల సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న బి.గౌరి, ఎం.లక్ష్మి, ఎం.జగదీశ్వరి, బి. విఘ్నేశ్వరరావులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో పరుగులు పెట్టి వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వెళ్లగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉందని తెలిసింది.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై కళాధర్

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శ్రీహరి గొడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని చినమేరంగి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం అందడంతో ఎస్సై కళాధర్ సిబ్బందితో కలిసి రైడింగ్ చేసి వారివద్ద నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్‌కు అప్పగించారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం అమ్మినా, కొన్నా చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ధనుంజయనాయుడు

పార్వతీపురం: భార్య మద్యం తాగవద్దని మందలించినందుకుగాను భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్యం తాగి గ్రామంలో తిరగవద్దని పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన యాళ్ల ధనుంజయనాయుడిని భార్య లక్ష్మి మందలించినందుకు ఇద్దరిమధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ధనుంజయ నాయుడు భార్య ఇంట్లో సమయంలో పెయిన్ కిల్లర్స్ ఒక్కసారిగా తినేసి ఆత్మహత్యాయత్నం చేశాడు. అదే సమయంలో వచ్చిన భార్య గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించింది.

విద్యార్థుల అభ్యున్నతికి ఎంఓయూలు దోహదం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు రమణారావు, గిరి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థుల అభ్యున్నతికి ఎంఓయూలు ఎంతో దోహదపడతాయని సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో రెయిన్‌బో సంస్థతో గురువారం ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు, పరిశోధనా రంగాల్లో సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో సంస్థ ఎండీ డాక్టర్ నాదేళ్ల గిరి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమణారావు, డీన్ ప్రొఫెసర్ లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800-00
బంగారం(22సి. 10గ్రా.)	56,650-00
వెండి (కిలో)	78,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹139	₹248	₹ 258

ఏం జరిగిందో పాపం..!

- అనుమానాస్పద స్థితిలో యువతి మృతదేహం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ గోవిందరావు



తుప్పల్లో పడిఉన్న ఉమామహేశ్వరి మృతదేహం





ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న డీఎస్పీ గోవిందరావు, ఎస్సై ముకుందరావు, (ఇన్‌సెట్లో) ఉమామహేశ్వరి (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి గేదులవానిపాలెం గ్రామం వెళ్లే రహదారిలో జమ్మాదేవిపేట సమీపంలో గల సరస్వతి లేఅవుట్ వద్ద కళ్లేపల్లి గ్రామానికి చెందిన వెలుగులో బుక్ కీపర్ గోకేడ ఉమామహేశ్వరి(29) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గురువారం ఈ విషయం తెలుసుకున్న మండల వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్థానికులు, ఎస్సై ముకుందరావు తెలియజేసిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సరస్వతి లేఅవుట్ సమీపంలో చిలకావాని చెరువులో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారు. వారిలో ఒక కూలీ సేద తీరేందుకు పక్కనే గల గట్టువద్దకు వచ్చి నిలబడి సమీపంలో మృతదేహాన్ని గుర్తించి తోటి కూలీలకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్సై ముకుందరావులు సిబ్బందితో చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహం ఫొటోను వాట్సాప్ గ్రూప్‌లో సెండ్ చేయగా కళ్లేపల్లి గ్రామానికి చెందిన గోకేడ ఉమామహేశ్వరిగా కొంతమంది గుర్తించారు. వెంటనే మృతురాలి కుటుంబసభ్యులకు విషయం చేరవేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని ఉమామహేశ్వరిగా గుర్తించారు. ఇదిలా ఉండగా విజయనగరం జిల్లా కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో సమావేశం ఉందని ఉమామహేశ్వరి బుధవారం ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయల్దేరి వెళ్లింది. రాత్రికి ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా ఆమె సమావేశానికి హాజరుకాలేదని అధికారులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యమైన తరువాత ఆమెను ఎక్కడో చంపేసి మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చి పడేసి ఉంటారని పోలీసులు భావించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్వాడ్‌లు వచ్చి పరిసర ప్రాంతాల్లో పరిశీలించినప్పటికీ ఎటువంటి ఆధారాలు లభించేలేదు. మృతురాలి భర్త నాయుడు ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు.

బిక్కుబిక్కుమంటూ ఇద్దరు పిల్లలు

కాగా మృతురాలికి నవనీత్ (13),సాద్విక్ (12) ఇద్దరు మగ పిల్లలు కలరు. మా అమ్మ విజయనగరం మీటింగ్‌కు వెళ్లింది తిరిగి వస్తుందని చెప్పడంతో అక్కడ ఉన్న వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ప్రాంతంలో గతంలో ఎప్పుడూ ఈ తరహా ఘటనలు జరగకపోవడంతో మండలవాసులు భయభ్రాంతులకు లోనయ్యారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

గుర్తు తెలియని యువకుడు..

గజపతినగరం: గజపతినగరం రైల్వే స్టేషన్ యార్డులో గుర్తు తెలియని యువకుడు(23)మృతి చెందాడు. ఈ ఘటనపై విజయనగరం రైల్వే ఎస్సై వి.రవివర్మ మాట్లాడుతూ అనారోగ్యం వల్ల గానీ, వడదెబ్బ వల్ల గాని మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గజపతినగరం: గుర్తు తెలియని యువకుడి మృతదేహం

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



అప్పలరాజు మృతదేహం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ షాక్‌తో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. నగరంలోని కేఎల్‌పురంలో ఓ ఇంటికి విద్యుత్ సరఫరా వచ్చి పోతుండడంతో యాజమాని పక్క వీధిలో ఉన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్కలి అప్పలరాజు (40)ను తీసుకొచ్చాడు. అక్కడ మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా ఆపాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ కాకుండా వేరే ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరా నిలిపివేసి విద్యుత్ పోల్ ఎక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించగా షాక్‌కు గురై కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే గృహ యజమాని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. విద్యుత్ పోల్ ఎక్కిన ఎలక్ట్రీషియన్ విద్యుత్‌శాఖకు సంబంధించిన వ్యక్తి కాదని ఎస్ఈ నాగేశ్వరావు తెలిపారు. అనధికారిగా విద్యుత్ పోల్ ఎక్కితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యల నివారణ కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బొబ్బిలి: గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన అక్కేన తవిటినాయుడు(53) ఈనెల 9న తెర్లాం మండలం నందబలగ వెళ్లి వస్తుండగా కారాడ వద్ద కోళ్లవ్యాన్ ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యాడు. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్షలపై సమీక్షిస్తున్న డీఆర్ఓ వెంకటరావు

పార్వతీపురం: ఈనెల 20న పార్వతీపురం మన్యం జిల్లాలో జరగనున్న గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పురపాలక శాఖ అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటిని అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద శానిటేషన్ చేసి, బ్లీచింగ్ వేయాలని ఆదేశించారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఆ సమయంలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు మహిళా పోలీసులు, ఇద్దరు కానిస్టేబుల్స్‌ను నియమించాలని పోలీసు శాఖ అధికారులను కోరారు. ఇన్విజిలేటర్లు, సూపర్‌వైజర్లు, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ కె.రమణ, చీఫ్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాగభూషణం తదితరులు

బొబ్బిలి: ఈనెల 28 నుంచి 31 వరకూ విశాఖపట్నంలో జరిగే వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ సూచనలు పట్టించుకోకుండా కార్పొరేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాం, ఇతర పరికరాలను విక్రయిస్తూ తమ వద్దే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్, హరి, ప్రవీణ్,గౌరి,వినయ్ తదితరులున్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు



పార్వతీపురం జిల్లా అస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులు

కొమరాడ: మండలంలోని కూనేరు నుంచి మసిమండ వెళ్తున్న ఆటో అదుపు తప్పి తుమ్మలవలస గ్రామ సమీపంలో మలుపు వద్ద బోల్తా పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు ఈ ఘటనపై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూనేరు నుంచి మసిమండ వెళ్లేందుకు ఆటోలో కొంతమంది ప్రయాణిస్తుండగా ఆటో అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మసిమండకు చెందిన కద్రక ప్రియ, హిమరిక వీరమ్మ, టి.రమకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఆరోగ్య గాయత్రీ' పేరుతో ఉచిత వైద్యసేవలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

- 21న డిప్యూటీ స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభం

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం ఉదయం 7.30 గంటలకు గాయత్రీ భవనంలో 'ఆరోగ్య గాయత్రీ' ఉచిత వైద్యశాల పేరుతో ఉచిత వైద్య సేవలు అందజేయనున్నట్లు సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ డీవీ శ్రీకాంత్, అధ్యక్షుడు భోగరాజు బాబూజీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం గాయత్రీ భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారన్నారు. అందరికీ ఉచిత వైద్యసేవలతో పాటూ అందుబాటులో ఉన్న మందులను ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న గాయత్రీభవనంలోనే వారానికి ఆరు రోజుల పాటూ (శనివారం తప్ప) వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ధవళ వెంకటరావు, భోగరాజు సూర్యలక్ష్మి, టిఎస్. ప్రకాశరావు, పి.రమణమూర్తి, వి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

విజయనగరం: ఈనెల 20,21 తేదీల్లో విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్ -19 జిల్లా బాల బాలికల జట్లు ఎంపిక గురువారం పూర్తయింది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ల సూరిబాబు, డీవీఈవో సురేష్‌బాబు, అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఎంపిక ప్రక్రియలో కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. శ్రీనివాసరావు, బొమ్మన రామారావు, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎల్.వి. రమణ పాల్గొన్నారు.

రామతీర్థంలో మాసశివరాత్రి పూజలు



మాసశివరాత్రి సందర్భంగా స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో మాస శివరాత్రి పూజలు గురువారం వైభవంగా జరిగాయి. స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలరసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఉమా సదాశివస్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గరివిడిలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్



యువతను ప్రొత్సహిస్తున్న ఎంపీ తనయుడు వంశీకృష్ణ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. గ్రామదేవత మరిడమ్మ తల్లి జాతర సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు పి.సంతోష్, కె.శంకర్, ఎం.కిషోర్‌కుమార్‌రాజు, జి.సంతోష్‌కుమార్, ఏవీ రావుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంటును ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులంతా స్ఫూర్తితో ఆడాలని, ఈ టోర్నమెంటులో మంచి ప్రతిభను కనబరచాలంటూ ప్రోత్సహించారు. టోర్నమెంటులో జిల్లావ్యాప్తంగా 60 టీమ్‌లు పాల్గొన్నాయి. విన్నర్స్‌గా నిలిచిన వారికి రూ.25వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, శరత్‌చంద్రతో పాటు యువత పాల్గొన్నారు.

వేతన వేదన దూరం..!

- ఉపాధి కూలీలకు త్వరగా అందుతున్న వేతనాలు
- ఈనెల 12 వరకు రూ.141.11 కోట్లు చెల్లింపు
- రోజూ పనికి వస్తున్న 2.44 లక్షల మంది వేతనదారులు



డెంకాడ మండలంలో పనిచేస్తున్న వేతనదారులు



శ్రీరంగరాజుపురంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి కింద సేదదీరుతున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతనదారులకు చేసిన పనికి సంబంధించి వేతనాలను ప్రభుత్వం త్వరగా చెల్లిస్తోంది. గత ప్రభుత్వ హయంలో పనిచేసిన నెల, నెలన్నర రోజుల తర్వాత వేతనాలు అందేవి. ఇప్పుడు పనిచేసిన నాలుగైదు రోజులకే వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. గతంలో వేతనాలు 8 రోజులకి జనరేట్ చేసేవారు. వేతనదారులకు త్వరగా వేతనాలు చెల్లించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం 3 రోజులకే వేతనాలు జనరేట్ చేస్తున్నారు. దీంతో పనిచేసిన వెంటనే వేతనాలు అందుతున్నాయి. జిల్లాలో 3.17 లక్షల జాబ్ కార్డులు ఉండగా 6.18 లక్షల వేతనదారులు ఉన్నారు.

ఏప్రిల్, మే నెలకు 59.64 లక్షల పనిదినాలు

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెల15 వరకు జిల్లాలో 59. 64 లక్షల పనిదినాలు కల్పించారు. ప్రస్తుతం ముమ్మరంగా ఉపాధి హామీ పనులు ప్రతి గ్రామంలో జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో వేతనదారులు పనికి హాజరవుతున్నారు. రాష్ట్ర స్థాయిలో వేతనదారులకు పనిదినాలు కల్పించడంలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది.

జాప్యం లేకుండా వేతనాల చెల్లింపు

వేతనదారులకు చేసిన పనికి సంబంధించి ప్రభుత్వం జాప్యం లేకుండా వేతనాలను చెల్లిస్తోంది. ఏప్రిల్ నెల నుంచి మే నెల 12 వతేదీ వరకు వేతనదారులు చేసిన పనికి వేతనాలు ప్రభుత్వం వేతనదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఇంతవరకు 141.11 కోట్లను జమయ్యాయి.

పనిచేసే చోట చలువ పందిళ్లు

ఎండ తీవ్రత దృష్ట్యా వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు డ్వామా అధికారులు వేతనదారులతో చలువ పందిళ్లు వేయిస్తున్నారు. టెంట్లు ఉన్న చోట వాటిని వినియోగిస్తున్నారు. లేని చోట కొబ్బరి కమ్మలు, తాటి కమ్మలతో పందిళ్లు వేయిస్తున్నారు.

త్వరగా వేతనాలు



వేతనదారులకు సంబంధించి వేతనాలు చాలా త్వరగా ప్రభుత్వం చెల్లిస్తోంది. గతంలో 8 రోజులకు వేతనాలు జనరేట్ చేస్తే ఇప్పుడు 3 రోజులకే జనరేట్ చేస్తున్నాం. టెంట్లు లేని చోట వేతనదారులు సేద దీరేందుకు చలువ పందిళ్లు వేయిస్తున్నాం.

జి.ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ